సాక్షి
పల్నాడు
సోమవారం, 10, జూలై, 2023



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడ పటమటకు చెందిన పి. లీలాకృష్ణ ప్రసాద్ రూ. 1.00,116 విరాళాన్ని అందజేసింది.



బగళాముఖి సేవలో..

పిట్టలవానిపాలెం: చందోలులోని బగళాముఖి అమ్మను ఏపీ స్టేట్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎల్.వి.రమణమూర్తి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



కూచిపూడి నృత్య ప్రదర్శన

విజయవాడ : ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం పలువురు చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

మత్తు వదిలిస్తున్నారు

ఇంటికొస్తే అమ్మా.. అమ్మా అంటూ కొంగు పట్టుకుని తిరిగే కొడుకు.. ఈ సారి సెలవుల్లో కనీసం ఇంటి పట్టున లేడు. ఎప్పుడూ ఏదో లోకంలో ఉన్నట్లు అనిపించే వాడు. పొడిపొడిగా మాట్లాడేవాడు. విషయం భర్తకు చెబితే పిల్లలతో ఆటలాడి అలసిపోయి ఉంటాడులే.. మళ్లీ ఈ ఫోనులొకటి అంటూ కొట్టిపారేశాడు. కాలేజీలు ప్రారంభమయ్యాక గుండెల్లో దిగులుతోనే కొడుకును పంపించింది ఆ తల్లి. కొద్దిరోజులకే పోలీసుల నుంచి ఫోన్.. ఆ తల్లిదండ్రుల గుండె జారిపోయింది. పిల్లాడు గంజాయికి అలవాటు పడ్డాడని పోలీసులు చెబుతుంటే.. ఆ తల్లిదండ్రుల కళ్లలో నీళ్లు కాలువలయ్యాయి. గంజాయి తీసుకుంటే బాగా చదువు వస్తుందమ్మా అంటూ కొడుకు తల్లి వద్దకు వచ్చి ఏడుస్తుంటే అది విన్నవారంతా విస్తుపోయారు.

– ఇదీ నరసరావుపేట టూటౌన్ పోలీసుల కౌన్సెలింగ్ సందర్భంగా సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే ఓ యువకుడు చెప్పిన మాట..

'మొత్తు'తూనే చక్కదిద్దుతూ

- గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల పటిష్ట నిఘా
- అమ్మకాలు, రవాణాపైనా కొరడా
- మత్తుకు బానిసలైన యువతకు కౌన్సెలింగ్
- బంగారు భవిష్యత్తు దృష్ట్యా మానవత్వంతో ముందుకు..
- విద్యా సంస్థల్లోనూ అవగాహన సదస్సులు



ఇంజినీరింగ్ కళాశాలలో మత్తు పదార్థాల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పల్నాడు జిల్లా ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి (ఫైల్)

నరసరావుపేట టౌన్: మత్తుపదార్థాల రవాణా, అమ్మకాలపై ఓ వైపు కొరడా ఝుళిపిస్తూనే మరో వైపు బానిసలైన యువతపై మానవత్వంతో వ్యవహరిస్తున్నారు పోలీసులు. ఇరవై ఏళ్లు కూడా నిండని యువకులు మత్తు పదార్థాలు, గంజాయికి బానిసలు అవుతుండడంతో వారి భవిష్యత్తు దృష్ట్యా ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా పరిస్థితిని చక్కదిద్దాలని తలంచారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కౌన్సెలింగ్ ఇచ్చి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నారు. వ్యసనం నుంచి విముక్తులయ్యేలా కృషి చేస్తున్నారు. కళాశాలలు, విద్యా సంస్థల్లోనూ మత్తుపదార్థాల దుష్పరిణామాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాల రవాణాను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. దీనికోసం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పల్నాడు జిల్లాలో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మత్తు పదార్థాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు 44 కేసులు నమోదు చేసి 58 మంది నిందితులను అరెస్ట్ చేశారు. చిలకలూరిపేట, పిడుగురాళ్ల, దుర్గి, వినుకొండ, నకరికల్లు, నరసరావుపేట వంటి ప్రాంతాల్లో ఈ ముఠా సభ్యులను గుర్తించి వారికి అడ్డుకట్ట వేశారు. ఇటీవల నర్సీపట్నం నుంచి రవాణా చేసిన 16 కేజీల సరుకును పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. గంజాయి రవాణా మార్గాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు.

విస్తుపోయే నిజాలు

గంజాయి విక్రేతల పని పడుతున్న పోలీసులు.. అసలు ఈ మత్తు పదార్థాలను ఎవరు వినియోగిస్తున్నారు. అనే విషయాలను కాల్ డేటా ద్వారా సేకరించారు. ఈ క్రమంలో పోలీసులకు విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. నరసరావుపేట, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో రోజూవారీగా సుమారు 350 మంది మత్తు పదార్థాలు కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. వీరిలో అధిక శాతం యువతే ఉండడం చూసి ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో వారిపై కేసులు నమోదు చేస్తే.. భవిష్యత్తు దెబ్బతింటుందనే ఉద్దేశంతో కౌన్సెలింగ్ ద్వారా మార్పు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. పల్నాడు జిల్లా ఎస్పీ సూచన మేరకు నరసరావుపేట టూటౌన్ సీఐ వీరేంద్రబాబు ఆధ్వర్యంలో ఇటీవల పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ కేవీ మహేష్ మత్తుపదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను కళ్లకు కట్టినట్లుగా వివరిస్తూనే గంజాయి సేవిస్తూ పట్టుబడితే పడే శిక్షల గురించి తెలియజేసి వారిని చైతన్యపరిచారు. అలాగే ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించి మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు.

కౌన్సెలింగ్‌తో మార్పు



జిల్లాలో మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించం. ఇప్పటికే గంజాయి ముఠాల ఆటకట్టించాం. యువత చిన్న వయసులోనే మత్తుకు బానిసవుతున్నారు. కౌన్సెలింగ్ ద్వారా వారి తల్లిదండ్రులతో చర్చించి మార్పు తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నాం. ఇది మంచి సత్ఫలితాలనిస్తోంది.

– వై.రవిశంకర్ రెడ్డి, ఎస్పీ, పల్నాడు జిల్లా



అమ్మవారి ఉత్సవ మూర్తికి సారె సమర్పిస్తున్న భక్త బృందాలు



ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి

దారులన్నీ ఇంద్రగిరికే..

- భక్తులతో కిక్కిరిసిన దుర్గమ్మ సన్నిధి
- రికార్డు స్థాయిలో అమ్మవారికి సారె

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసోత్సవాలలో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు రికార్డు స్థాయిలో సారెను సమర్పించారు. నగరవాసులతో పాటు పలు జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి సారెను సమర్పించారు. నగరంలోని ఏ ఇంట చూసినా, ఏ వీధిలో చూసినా అమ్మవారి సన్నిధికి బయలుదేరిన భక్త బృందాలే దర్శనమిచ్చాయి. ఆదివారం ఒక్క రోజే సుమారు 150కి పైగా భక్త బృందాలు అమ్మవారికి సారెను సమర్పించగా, సుమారు 80 నుంచి 90 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

దర్శనానికి నాలుగు గంటలు..

ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. భక్తుల రద్దీతో మహా మండపం లిఫ్టులను సైతం దేవస్థాన అధికారులు నిలిపివేశారు. దీంతో మహా మండపం మెట్లు, పాత మెట్లు, ఘాట్‌రోడ్డు మీదగా భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. సర్వ దర్శనం, రూ. 500, రూ. 300, రూ. 100 టికెట్లు క్యూలైన్లు ఏ మార్గంలోనైనా అమ్మవారి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టిందంటే రద్దీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. క్యూలైన్లు త్వరత్వరగా ముందుకు నడిచేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ అమ్మవారి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది.

సారె సంబరం..

ఆదివారం ఉదయం నుంచి ప్రారంభమైన అమ్మవారి సారె సంబరం రాత్రి 7 గంటల వరకు కొనసాగింది. అమ్మవారి ఆలయానికి చేరుకున్న భక్తులు క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకుని మహా మండపం 6వ అంతస్తులో సారె సమర్పించే కార్యక్రమాన్ని ముగించడానికి గంటల తరబడి సమయం పట్టింది. దర్శనం పూర్తయిన భక్తులతో పాటు అమ్మవారికి సారె సమర్పించిన తిరుగు ప్రయాణం అయ్యే భక్తులను మల్లికార్జున స్వామి వారి ఆలయం మెట్ల మార్గం ద్వారా కిందకు పంపారు.

ఆలయం చుట్టూ భక్త బృందాలు

అమ్మవారికి సారెను తీసుకువచ్చిన భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనానికి అనుమతించారు. అయితే ఆదివారం ఒక్కసారిగా సాధారణ భక్తులు, భక్త బృందాలు కొండకి చేరుకోవడంతో ఆలయ పరిసరాలన్నీ కిటకిటలాడాయి. భక్త బృందాలను ప్రత్యేక మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించడం, అదే సమయంలో సాధారణ భక్తుల క్యూలైన్ నిలిచిపోయింది. దీంతో అంతరాలయం దర్శనం నిలిపివేయాలని ఈవో భ్రమరాంబ ఆదేశాలు జారీ చేశారు. అయితే అప్పటికే రూ. 500 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు మహా మండపం మెట్లు, ఘాట్‌రోడ్డులోని క్యూలైన్‌లో చిక్కుకుపోయారు. మరో వైపున భక్తుల రద్దీ సమయంలోనూ దేవస్థానం అంతరాలయం పేరిట రూ. 500 టికెట్లను విక్రయించడంతో పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

శుభకార్యానికి వెళ్తూ.. మృత్యుఒడికి..

- ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరి దుర్మరణం
- మరో ఏడుగురికి తీవ్ర గాయాలు
- అతివేగమే కారణమా..!



కాలువలో బోల్తాపడిన ట్రాక్టర్





మృతి చెందిన లక్ష్మీనారాయణ, భూదేవయ్య

దుర్గి: దైవ సన్నిధిలో జరుగుతున్న శుభకార్యక్రమంలో పాల్గొనేందుకు ఆనందంగా ట్రాక్టర్‌లో గ్రామస్తులతో కలిసి బయలుదేరిన ఆ ఇద్దరిని మృత్యువు కబళించింది. అప్పటివరకు సంతోషంగా చెప్పుకున్న కబుర్లు గమ్యస్థానానికి మరో ఐదు నిమిషాల్లో చేరతారనగా హాహాకారాలయ్యాయి. ఈ విషాద ఘటన ఆదివారం అడిగొప్పల శివారు శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయ సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. కారెంపూడి మండలం నరమాలపాడుకు చెందిన పాతూరి గురవయ్య తన మనవడి అన్నప్రాశన కార్యక్రమాన్ని శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ ఆలయం వద్ద ఏర్పాటు చేశాడు. దీనికి గ్రామస్తులను ఆహ్వానించాడు. కొందరు బంధువులు, స్నేహితులతో ఆయన ముందుగా ఆటోలో వెళ్లాడు. అనంతరం మధ్యాహ్నం నరమాలపాడు నుంచి 20 మంది గ్రామస్తులు ట్రాక్టర్‌లో అమ్మవారి ఆలయానికి బయలుదేరారు. మరో ఐదు నిమిషాల్లో ఆలయానికి చేరతారనగా ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి మూల మలుపు వద్ద ట్రాక్టర్ అతివేగం వల్ల అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ట్రాక్టర్ ట్రక్కులో ఉన్న పాతూరి లక్ష్మీనారాయణ(50), దేవళ్ల భూదేవయ్య (46), మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మీనారాయణ, భూదేవయ్య మరణించారు. జంబుల సాంబయ్య, యర్రంశెట్టి ఏడుకొండలు, కామసాని ఏడుకొండలు, అక్కిశెట్టి కృష్ణయ్య, పి.వెంకటేష్, మంచాల చౌడయ్య, షేక్ హిమాంసా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనాస్థలాన్ని కారెంపూడి సీఐ డి.జయకుమార్ పరిశీలించారు. కేసు దర్యాప్తుచేస్తున్నారు. దుర్ఘటనతో నరమాలపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి.

విశాఖ నుంచి శుభకార్యానికి వచ్చి..

లక్ష్మీనారాయణ బతుకు తెరువు నిమిత్తం విశాఖపట్నంలో ఉంటున్నాడు. బంధువు పిలుపు మేరకు శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చాడు. ప్రమాదంలో మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

పెద్దదిక్కు పోయాడు

నరమాలపాడులోనే వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తున్న భూదేవయ్యకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్దదిక్కుగా ఉన్న ఆయన మరణంతో ఆ కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. యర్రంశెట్టి ఏడుకొండలు కాళ్లు నుజ్జు కావడంతో అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

వెల్లు'విత్తిన' స్ఫూర్తి

కోటి సంతోషాల దీప్తి

- నల్లమలలో కోటి విత్తన బంతులు చల్లే కార్యక్రమం ప్రారంభం
- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
- కలెక్టర్ లోతేటి శివశంకర్



నల్లమల అడవిలో విత్తన బంతులు చల్లుతున్న కలెక్టర్ శివశంకర్, విద్యార్థినులు అధికారులు

కారెంపూడి: మానవ తప్పిదాలు ప్రకృతికి చేటు చేస్తున్నాయని, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని కలెక్టర్ లోతేటి శివశంకర్ చెప్పారు. కారెంపూడికి చెందిన పర్యావరణ ప్రేమికుడు కొమెర అంకారావు (జాజి) ఆధ్వర్యంలో నల్లమలలో కోటి విత్తన బంతులు (సీడ్ బాల్స్) చల్లే కార్యక్రమాన్ని కలెక్టర్ శివశంకర్ ఆదివారం ప్రారంభించారు. విద్యార్థులు, అధికారులతో కలిసి అడవిలోకి వెళ్లి కలెక్టర్ దాదాపు ఆరువేల విత్తన బంతులు చల్లారు. ఎరువు కలిపిన బంక మట్టిలో విత్తనం ఉంచి దానిని చిన్న బంతులు(ఉండలు)గా చేసి చల్లితే అవి వర్షాలు పడినప్పుడు మొలక వచ్చి మొక్కగా ఎదుగుతాయని జాజి, అటవీశాఖ అధికారులు వివరించారు. అంతకు ముందు జరిగిన సభా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం, అడవుల నరికివేత వల్ల పర్యావరణానికి హాని కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భూతాపం పెరగడం, వాతావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల తలెత్తే అనర్థాలతోపాటు మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను కలెక్టర్ వివరించారు. కొమెర జాజి సంకల్పాన్ని అభినందించారు. అడవుల్లో అంతరించిపోతున్న అరుదైన వన మూలికల పరిరక్షణకు కృషి చేస్తున్న జాజి అత్యున్నత పురస్కారం అందుకుంటారని కొనియాడారు. అనంతరం జాజిని కలెక్టర్ సన్మానించారు. తొలుత నాయకురాలు కనుమ వద్ద ఉన్న మంత్రాలమ్మ తల్లికి కలెక్టర్ పూజలు చేశారు. అనంతరం నల్లమలలో ఎర్రటి ఎండలో మధ్యాహ్నం వరకు తిరిగి విత్తన బంతులు చల్లే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ గబ్రూనాయక్, జెడ్పీటీసీ షేక్ షఫీ, తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీలు కొంగర సుబ్రమణ్యం, వేముల లింగయ్య, మాజీ ఎంపీటీసీ కొమ్ము చంద్రశేఖర్, అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ శ్రావణ్‌కుమార్, ఎస్ఐ జిలాని పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అదనపు భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

అనంతరం కారెంపూడి పీహెచ్‌సీని కలెక్టర్ పరిశీలించారు. రూ.50 లక్షలతో చేపట్టే అదనపు భవనాల నిర్మాణానికి స్థలాన్ని చూశారు. పీహెచ్‌సీ ముందున్న పాత తహసీల్దార్ కార్యాలయం స్థలాన్ని కలెక్టర్ ఎంపిక చేశారు. అంతకు ముందు ఆదినారాయణ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. తల్లిదండ్రులు విడిపోయి డ్రాపవుట్స్‌గా మిగిలి చదువుకుంటామని తన వద్దకు వచ్చిన ఇద్దరు బాలికలను కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో చేర్చాలని ఎంఈఓను కలెక్టర్ ఆదేశించారు.

సీఎం జగన్‌ది బహుజన ప్రభుత్వం

- పల్నాడు బీసీ సంక్షేమ సంఘ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి
- హాజరైన రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య, ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఎమ్మెల్సీలు పోతుల సునీత, ఏసురత్నం



కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య, ఎమ్మెల్సీలు సునీత, జంగా, ఏసురత్నం, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది బహుజన ప్రభుత్వమని, బీసీల ఆత్మగౌరవం కోసం సీఎం కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి చెప్పారు. ఆదివారం ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సారథ్యంలో భువనచంద్రటౌన్ హాలులో పల్నాడు జిల్లా బీసీ సంక్షేమ సంఘ ఆత్మీయ సమావేశానికి ఆ సంఘ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీలు పోతుల సునీత, జంగా కృష్ణమూర్తి, చంద్రగిరి ఏసురత్నం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత మహాత్మాజ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే చిత్రపటాలకు నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్ ఇ.ఎం.స్వామి, వడ్డెర సంక్షేమ సంఘ జిల్లా సభ్యుడు వేముల శివ అధ్యక్షతన నిర్వహించిన సభకు హాజరైన బీసీ వర్గీయులను ఉద్దేశించి ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ సీఎం జగన్ బీసీ డిక్లరేషన్ ప్రకటించారని, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ల కోసం బీసీ కమిషన్ ఏర్పాటు చేశారని కొనియాడారు.

బీసీలకు అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఆర్.కృష్ణయ్యను రాజ్యసభకు పంపారని గుర్తుచేశారు.

చంద్రబాబు బీసీ వ్యతిరేకి

ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు బీసీ వ్యతిరేకి అని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ బీసీలకు అమిత ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రశంసించారు.

చేతల ప్రభుత్వం

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ సీఎం జగన్‌ది చేతల ప్రభుత్వమని, ఆయన వడ్డెర కులానికి రాజకీయ ప్రాధాన్యం కల్పించారని కొనియాడారు.

అత్యధిక ఎమ్మెల్సీలు బీసీలకే

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు గతంలో తన 48 మంది ఎమ్మెల్సీలలో 11 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వగా సీఎం జగన్ 44 మంది ఎమ్మెల్సీలలో 19 మంది బీసీలకు చోటు కల్పించారని గుర్తుచేశారు. 70 మంది బీసీలకు అసెంబ్లీ సీట్లు కేటాయించారని వివరించారు. మరోసారి జగన్ సీఎం అయితే బీసీలకు 50 శాతం అధికారం దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి, బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరి నాని, పూసల కార్పొరేషన్, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్లు కోలా భవాని, పురుషోత్తం మాట్లాడారు. జంగం కార్పొరేషన్ డైరెక్టర్ మఠం సునీల్‌కుమార్, బీసీ నాయకులు బోయన రామకృష్ణ, వెంకటరావు, తురగా కిషోర్, బోయిన సుబ్బారావు, వరప్రసాదు, మోరబోయిన శ్రీనివాసరావు, తోట వీరయ్య పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఎమ్మెల్యేగోపిరెడ్డి, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యను సన్మానించిన దృశ్యం

న్యూస్‌రీల్

రాజుపాలెం ఎస్ఐపై కేసు

భార్య ఆత్మహత్య నేపథ్యంలో పరిణామం

రాజుపాలెం: సంచలనం సృష్టించిన ఎస్ఐ భార్య ఆత్మహత్య ఘటనలో ఆదివారం కేసు నమోదైంది. రాజుపాలెం ఎస్ఐగా పనిచేస్తున్న ఎం.నారాయణ భార్య లక్ష్మీగీత, ఇద్దరు పిల్లలతో పోలీసు క్వార్టర్స్‌లో ఉంటున్నారు. తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం గుణపాడు గ్రామానికి చెందిన ఎస్ఐ నారాయణకు రేణిగుంటకు చెందిన లక్ష్మీగీతతో 2018లో వివాహమైంది. శనివారం బాబు పుట్టినరోజు పండగను ఎస్ఐ సొంత గ్రామంలో చేసుకునేందుకు బయలుదేరే క్రమంలో భార్యాభర్తల మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో మనస్థాపం చెందిన లక్ష్మీగీత ఉరి వేసుకుని మరణించింది. శనివారం సాయంత్రానికి తల్లిదండ్రులు, బంధువులు రాజుపాలెం చేరుకుని శోక సముద్రంలో మునిగిపోయారు. లక్ష్మీగీత తల్లి లక్ష్మీకుమారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.నారాయణపై కేసు నమోదు చేసినట్లు సత్తెనపల్లి రూరల్ సీఐ కోటేశ్వరరావు తెలిపారు. లక్ష్మీగీత మృతదేహానికి సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం పూర్తిచేసి బంధువులకు అప్పగించారు. రాజుపాలెం ఇన్‌చార్జి ఎస్ఐగా నకరికల్లు ఎస్ఐ టి.సురేష్‌ను నియమించారు.

షూటింగ్‌లో ఓవరాల్ చాంప్ కృష్ణా



విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షూటింగ్ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఆర్ఏఏపీ) ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లోని షాట్స్ షూటింగ్ రేంజ్‌లో ఈ పోటీలు జరిగాయి. 10 మీటర్ల రైఫిల్, పిస్తోల్, 25 మీటర్ల పిస్తోల్, 50 మీటర్ల రైఫిల్, పిస్తోల్, షాట్‌గన్ విభాగాల్లో సబ్‌జూనియర్, జూనియర్, యూత్, సీనియర్, మాస్టర్స్, సీనియర్ మాస్టర్స్ స్త్రీ, పురుషుల కేటగిరీల్లో జరిగిన ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో అత్యధికంగా 60 పతకాలతో కృష్ణా జిల్లా ముందంజలో ఉండగా 40 పతకాలతో గుంటూరు, 28 పతకాలతో విశాఖపట్నం వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు విజయవాడలోని లెమన్‌ట్రీ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆదివారం పతకాలు అందజేశారు. ఆర్ఏఏపీ అధ్యక్ష, కార్యదర్శులు టి.సలలిత్, డి.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.కిరణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు రామకృష్ణారెడ్డి, ఖాదర్‌బాబు విజేతలకు మెడల్స్ అందజేశారు.

దుర్గమ్మ భక్తులకు ఉచిత బస్సులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత బస్సులను దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. దుర్గగుడి చైనావాల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉచిత బస్సు సర్వీసులకు తొలుత ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే దుర్గాఘాట్ నుంచి కొండపైన ఓం టర్నింగ్ వరకు ఈ బస్సులు నడుస్తాయని చైర్మన్ రాంబాబు పేర్కొన్నారు. ఉచిత సర్వీసుల కింద రెండు బస్సులను కేటాయించామని, ప్రతి రోజు ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారులు, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 519.30 అడుగుల వద్ద ఉంది. ఇది 148.0031 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 808.90 అడుగుల వద్ద ఉంది. ఇది 32.6709 టీఎంసీలకు సమానం.

సీఎం వైఎస్ జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎంపీ ఆర్.కృష్ణయ్య
- నూతన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న మార్కెట్ యార్డు నూతన కార్యవర్గం

రొంపిచర్ల: రాష్ట్రంలో అందరినీ విద్యావంతులను చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో ఆదివారం రాత్రి నిర్వహించిన నూతన మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సీఎంకు మద్దతుగా ఉంటే అన్నీ వర్గాల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు, నాయకులు వెనుకబడిన కులాల అభివృద్ధికి దృష్టి సారించలేదని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో బీసీ బిల్లు ప్రవేశపెట్టి స్థానిక సంస్థలు, కార్పొరేషన్లలో 50శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే అన్నారు. మరో 20ఏళ్లలో రాష్ట్రం మరో డల్లాస్‌లాగా తయారవుతుందని ఆకాంక్ష వ్యక్తం చేశారు. సీఎం చేపట్టిన సంస్కరణల ఫలితంగా వడ్డెర కులానికి చెందిన చిన్నమ్మాయి మార్కెట్ యార్డు చైర్మన్ కాగలిగిందని వివరించారు. రైతులకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. ఈ ఏడాది నుంచే సంతగుడిపాడులో రూ.10 కోట్లతో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డు అభివృద్ధికి రైతాంగానికి నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందించాలని నూతన కమిటీకి సూచించారు. చైర్మన్‌గా బత్తుల చిన్నమ్మాయి రామకృష్ణ, వైస్ చైర్మన్‌గా పాలిమేర శ్రీనివాసరెడ్డి ప్రమాణస్వీకారం చేయగా మరో పదిమంది డైరెక్టర్లుగా ప్రమాణస్వీకారం చేశారు. వీరందరితో మార్కెట్‌యార్డు కార్యదర్శి ఆంజనేయ సింగ్ ప్రమాణస్వీకారం చేయించారు. సభలో ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఖాజావలి, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతి, జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబులురెడ్డి, ఎంపీపీ గడ్డం వెంకటరావు, నాయకులు చపారపు గోపాలరెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, పాలిమేర వెంకటరెడ్డి, గెల్లి చినకోటిరెడ్డి, కోడూరి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, వేదికపై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ఎమ్మెల్సీలు

రైతును రాజును చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే

- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- వైఎస్సార్ పంట బీమాలో దుర్గి మండలానికి ప్రథమ స్థానం


రైతులకు పంట బీమా నమూనా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: రైతును రాజు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల కార్యాలయ ఆవరణలో ఎంపీపీ ఏచూరి సాయి శంకర్ ఆధ్వర్యంలో రైతు దినోత్సవం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో అత్యధికంగా రూ.9.13 కోట్లు వైఎస్సార్ పంట బీమా వలన రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. రెంటచింతలకు రూ.1.19 కోట్లు, కారంపూడికి రూ.1.26 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ దాదాపుగా 20వేలపై చిలుకు రైతులకు నియోజకవర్గ స్థాయిలో మొత్తం రూ.11.38కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. రైతులకు పూర్తిగా బీమా మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ గత నాలుగు విడతలుగా ప్రతి ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పూర్తి పంట నష్టాన్ని అందిస్తున్న ప్రభుత్వం మనదని తెలిపారు. టీడీపీ హయాంలో కేవలం కొద్దిపాటి రైతులకు తూతూ మంత్రంగా బీమాను చెల్లించి రైతులను మభ్యపెట్టారని పేర్కొన్నారు. కుల, మతాల, పార్టీలకతీతంగా ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను అర్హులకు అందిస్తున్న ఘనత మన సీఎం జగన్‌కే దక్కిందన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో వారికి సలహాలు, సూచనలు అందజేసి మండలంలో 10 వేలకు పైగా రైతులకు వైఎస్సార్ పంట బీమా పొందటానికి అన్నీ రకాలుగా తన వంతు గా సేవ చేసిన వ్యవసాయాధికారి వై.అమీర్‌రెడ్డిని ప్రభుత్వ విప్ పీఆర్కే, రైతులు పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శెట్టిపల్లి యలమంద, మార్కెట్ యార్డు చైర్మన్లు వెలిదండి గోపాల్, తాడి వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు ఊరిబండి ఏగయ్య, చల్లా శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ కటకం రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నం పెద్దబ్బాయ్, యకటీల బుచ్చిబాబు, కటకం చిన్న వెంకటయ్య, ఊరిబండి మన్నయ్య, బొబ్బా సీతారామిరెడ్డి, కటకం గోపాల్, తోటకూర నాగేశ్వరరావు, పసుపులేటి వెంకట్రామయ్య, శెట్టిపల్లి కోటేశ్వరరావు, గూడా రామకృష్ణ, జక్కా రమేష్, రాయపాటి మాణిక్యం, తోట మూర్తి, తోటకూర వెంకటేశ్వర్లు, జంగా కొండలు, జక్కా బాజి న్నారు.

ముగిసిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

- విజేతగా నిలిచిన చీరాల 'ఎ' క్లబ్ జట్టు
- ఎనిమిది జిల్లాల జట్లు హాజరు


ట్రోఫీ అందుకున్న చీరాల ఫుట్‌బాల్ క్లబ్ 'ఎ' జట్టు క్రీడాకారులు

చీరాల రూరల్: స్థానిక ఎస్‌ఆర్‌అండ్‌ పీఎం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పీలే ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. రెండురోజులు పాటు నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని 8 క్రీడా జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు దొడ్డా రాజీవ్ తెలిపారు. ఎంతో ఉత్సాహంగా జరిగిన ఈ పోటీల్లో విజేతగా చీరాల ఫుట్‌బాల్ క్లబ్ 'ఎ' జట్టు విజేతగా నిలవగా చీరాల ఫుట్‌బాల్ క్లబ్ 'బి' జట్టు ద్వితీయ స్థానం సాధించింది. విజేతగా నిలిచిన క్రీడా జట్టుకు హైమా హాస్పిటల్ అధినేత డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు చేతుల మీదుగా రూ.5 వేలు బహుమతితో పాటు కప్ అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.3 వేలు బహుమతి, కప్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలను కూడా సమానంగా చూడాలన్నారు. క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. బాపట్ల జిల్లా ఏర్పడిన తరువాత మొట్టమొదటి సారిగా చీరాలలో ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకుడు రాజీవ్ తెలిపారు.

ఆధిక్యంలో ప్రకాశం జట్టు


కె.రేవంత్‌నాగ్ (103 పరుగులు)

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-19 బాలుర టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లో ప్రకాశం జిల్లా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత సాధించింది. ప్రకాశం జట్టు తన ఓవర్‌నైట్ స్కోర్ 9వికెట్ల నష్టానికి 437 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన పశ్చిమ గోదావరి జట్టు రెండో రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి 302 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని కె.రేవంత్‌నాగ్ 103 పరుగులు చేయగా, హర్షవర్ధన్ 54, హర్షసాయితేజ 38 పరుగులు సాధించారు. ప్రకాశం బౌలర్లు జి.గురుపార్థసారథి, పి.దుర్గాబాలాజీ చేరో 3 వికెట్లు సాధించగా, ఎం.అభినవ్‌కు రెండు వికెట్లు లభించాయి. సోమవారం మూడో రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్టేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాలు.. చీరాల- వేటపాలెం రైల్వే స్టేషన్ల మధ్య అప్‌లైన్‌లో గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు అందిన సమాచారం అందింది. ఈమేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. మృత దేహం వద్ద ఎటువంటి సమాచారం లభించలేదని, మృతుడి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందన్నారు. రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పర్చూరులో 144 సెక్షన్

పర్చూరు (చినగంజాం): ఆక్రమణల తొలగింపులో భాగంగా పోలీసులు పర్చూరులో 144 సెక్షన్ విధించారు. తొలగింపు ప్రక్రియ సోమవారం నుంచి నిర్వహించనుండడంతో తహసీల్దార్ కె.సంధ్యశ్రీ నేటి నుంచి 144 సెక్షన్ విధిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పర్చూరు బొమ్మల సెంటర్ నుంచి బస్టాండు వరకు, బొమ్మల సెంటర్ నుంచి గుంటూరు రోడ్డులోని వాగు వరకు, బొమ్మల సెంటర్ నుంచి ఉప్పుటూరు బ్రిడ్జి వరకు రహదారి పూర్తిగా ఆక్రమణలకు గురైంది. ఈ ఆక్రమణలను వెంటనే తొలగించాలని కోర్టు గతంలోనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో నేషనల్ హైవే అధికారులు ఇటీవల పర్చూరు వచ్చి రోడ్డు ఆక్రమణలను పరిశీలించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. దాంతో ఆక్రమణలు తొలగింపు సమయంలో 144 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని స్థానిక తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు. తొలగింపు ప్రదేశం నుంచి 200 మీటర్ల వరకు ఎవరూ గుంపులుగా ఉండరాదని ఆమె తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించేందుకు దుకాణ యజమానులకు ఇచ్చిన సమయం సోమవారంతో ముగిసింది. స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించకపోతే క్రేన్ సహాయంతో తొలగించాల్సి వస్తుందని ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరించారు.

పాత నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు


బాపట్లటౌన్: రౌడీషీటర్లు, పాతనేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లాలోని రౌడీషీటర్లు, పాత నేరస్తులు, సస్పెక్ట్ షీటర్లకు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ రౌడీలు, సస్పెక్టులు, పాత నేరస్తుల కదలికలపై పోలీసు అధికారులు దృష్టి సారించాలన్నారు. వీరితోపాటు వారితో సన్నిహితంగా వుండే వ్యక్తుల వివరాలు, వారి జీవనోపాధి ఇతర సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. వారు కలుస్తున్న వ్యక్తులపై నిఘా వుంచి, మరల ఏదైనా నేరం చేసే అవకాశం ఉందా అనే సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై పీడీ చట్టం అమలుపరిచి జైలుకు పంపడం, జిల్లా బహిష్కరణ వంటి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రౌడీషీటర్లు, పాతనేరస్తులు చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమన్నారు.


తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ కమలాకర్

మార్టూరు: తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈఘటన మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఆదివారం ఉదయం వెలుగు చూసింది. ఎస్ఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బట్టు రేణుక ఈనెల 6వ తేదీ రాత్రి గుంటూరు ఆసుపత్రిలో ఉన్న తన భర్త, మనుమడు దగ్గరకు వెళ్తూ ఇల్లు చూస్తుండమని కోడలికి చెప్పింది. శనివారం రాత్రి రేణుక ఇంటికి తాళం వేసి తన ఇంటికి వెళ్లిన కోడలు ఆదివారం ఉదయం గేదెల పాలు పితకడం కోసం మళ్లీ ఇంటికి వచ్చింది. ఈక్రమంలో తలుపులు పగులగొట్టి ఉన్న విషయం గమనించి అత్త రేణుకకు ఫోన్ చేసి విషయం తెలిపింది. రేణుక సమాచారంతో ఎస్ఐ చోరీ ప్రదేశాన్ని పరిశీలించారు. బీరువా లాకర్‌లో ఏడు ఉంగరాలు, రేణుకకు చెందిన మరో 4 గ్రాముల ఉంగరం, టీవీ కింద ఉన్న సొరుగులో ఉంచిన రూ.2.07 లక్షలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. రేణుక ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురేష్


బొజ్జా సురేష్


బాబూరావు

చీరాల అర్బన్: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా సురేష్ ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక జేసీ కాంప్లెక్స్‌లో ఆశాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కె.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దినారి ప్రభాకర్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా కఠారి మురళి, అధ్యక్షుడిగా బొజ్జ సురేష్, ప్రధాన కార్యదర్శిగా జగన్నాథం బాబూరావు, కోశాధికారిగా భూక్యా కొండా నాయక్, మహిళా అధ్యక్షురాలిగా శివపార్వతి, ఉపాధ్యక్షులుగా పొట్లూరి రాజశేఖర్, కట్టా చంద్రమోహన్, మేడ శ్రీనివాసరావు, ఇట్టా రామారావు, జాయింట్ సెక్రటరీలుగా కుంభా వీరాంజనేయులు, కట్టా సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పాలపర్తి సారథితో పాటు మరో 25 మందితో జిల్లా కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మొగిలి శ్రీనివాసరావు, మేడ శ్రీనివాసరావు వ్యవహరించారు.

టీడీపీ అండ్ కోకు ఒంటరిగా పోటీ చేసే సత్తా ఉందా?

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



చెరుకుపల్లి: నమ్మిన వాళ్లను వెన్ను పోటు పొడవటం ప్రజలకు అబద్ధాలు చెప్పి అనుకున్న లక్ష్యాలు నెరవేర్చుకోవటం టీడీపీ నేత చంద్రబాబు నాయుడుకు వారి పార్టీ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. చెరుకుపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీజేపీలో కేంద్ర మంత్రులను, ప్రధానమంత్రిని కలిసి మాట్లాడితే, రాష్ట్రంలో ముందస్తు ఎన్నికల కోసమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ వెళ్లారంటూ టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఏ అడుగువేసినా రాష్ట్ర ప్రజల సంక్షేమమే తప్ప, మరో ఆలోచన ఉండదన్నారు. ఒకవేళ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎటువంటి పొత్తులు లేకుండా ఒంటరిగానే 175 సీట్లు పోటీచేయటానికి సిద్ధంగా ఉన్నారని, టీడీపీ వారికి వత్తాసు పలికే భజన పార్టీలు ఎటువంటి పొత్తులు లేకుండా ఒంటరిగా 175 మంది అభ్యర్థులతో పోటీ చేసే దమ్ము ఉందా అని సవాల్ విసిరారు. చంద్రబాబు నాయుడు టీడీపీని లాక్కున్న నాటి నుంచి నేటి వరకూ పొత్తులతోనే పోటీ చేశాడు తప్ప ఒంటరిగా పోటీ చేసి తన బలాన్ని నిరూపించుకున్న దాఖలాలే లేవన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ 175 సీట్లు గెలిచి, మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. బాపట్ల జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, పార్టీ మండల కన్వీనర్ ఏడుకొండలరెడ్డి, బి.రామారావు, ఎం.ప్రసాద్, ఎల్లెల రవికిరణ్, కామినేని కోటేశ్వరరావు, చెన్ను కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈత అత్యుత్తమ వ్యాయామం

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- ముగిసిన రాష్ట్రస్థాయి ఈత పోటీలు



విజేతలతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: ఈత అత్యుత్తమ వ్యాయామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో రెండు రోజులుగా ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లాల ఆక్వాటిక్ చాంపియన్‌షిప్- 2023 పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి 327 మంది స్విమ్మర్లు పాల్గొన్నారు. పోటీలో భాగంగా 25 ఈవెంట్‌లలో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 విభాగాలలో నిర్వహించారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈత ద్వారా శరీరంలోని ప్రతి అవయవం చైతన్యం పొందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించేందుకు ముందుకు వచ్చి విజయవంతం చేసిన జిల్లా అసోసియేషన్ ప్రతినిధులను, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పి.గోవిందరాజు, కార్యదర్శి ఏ మోహన్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఏఏ రామలింగారెడ్డి, కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

దర్జాగా కారులో వచ్చి చోరీ..

పోలీసుల అదుపులో కొత్తపేట చోరీ కేసులో నిందితుడు

పట్నంబజారు: దర్జాగా తయారై వస్తాడు.. షూట్, బూట్ వేసుకుని వైద్యుడినని నమ్మబలుకుతాడు.. కళ్లు మూసి తెరిచేలోపు చోరీ చేసి వెళ్లిపోతాడు. గుంటూరు నగరంలోని కొత్తపేట మంగళబావి సందులో కొద్దిరోజుల కిందట జరిగిన చోరీలో నిందితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. నాలుగు రోజుల కిందట గుంటూరు కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని మంగళబావి సందులో సూరినేడి నరసింహారావు ఇంటిలో భారీ చోరీ జరిగిన సంగతి తెలిసిందే. చోరుడు మూడు కిలోల బంగారం, రెండు కిలోల వెండి ఆభరణాలు, రూ. 1.80 లక్షలు అపహరించుకు పోయాడు. సీసీ ఫుటేజీ, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు ఫొటో ఆధారంగా దర్యాప్తు చేశారు. శరీర ఆకృతి ఆధారంగా పలువురు పాత నేరస్తుల కదలికలపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి హైదరాబాద్‌లో నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. బంగారం అపహరించుకుపోయి కారులో ఉంచడంతో పూర్తిగా బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నిందితుడు ప్రకాశం జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. హైదరాబాద్‌లో ఉంటూ వైద్యుడిని అని చెప్పుకుంటూ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. కారులోనే బంగారు ఆభరణాలు ఉంచుకుని తిరుగుతున్న క్రమంలో గుంటూరు పోలీసులు హైదరాబాద్‌లో శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పూర్తి స్థాయిలో బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. తన కారులో గుంటూరు వచ్చిన నిందితుడు కొత్తపేటలోని నరసింహారావు నివాసంలో చోరీకి పాల్పడ్డాడు. ఇంటికి తాళాలు వేసి ఉండటం గమనించి, వాటిని పగులగొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలు అపహరించుకుపోయాడు. ఈ క్రమంలో నివాసంలో అద్దెకు ఉండే మహిళ వ్యక్తిని గమనించినట్లు తెలిసింది. గుంటూరు సీసీఎస్ పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకుని కొత్తపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఎన్నో కేసులు...

హైదరాబాద్‌లో పలు చోరీ కేసుల్లో నిందితుడ్నిఅదుపులోకి తీసుకున్న పోలీసులు అతని నేరాల చిట్టా చూసి అవాక్కయ్యారు. సుమారు 70కు పైగా కేసులు ఉన్నట్లు గుర్తించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే అధికంగా కేసులు ఉన్నట్లు తెలుసుకున్నారు. పాత నేరస్తుల చిట్టాలో నిందితుడి పేరు ఉండటం, ఈ క్రమంలో సీసీ ఫుటేజీలో ఉన్న వ్యక్తి అతనే అని గుర్తించారు. చోరీ జరిగిన సమయంలో సెల్‌ఫోన్ టవర్ ఆధారంగా నిందితుడు పక్కాగా ఇక్కడే ఉన్నట్లు గుర్తించిన పోలీసులు హైదరాబాద్‌లో మాటు వేసి నిందితుడ్ని పట్టుకున్నారు. ప్రస్తుతం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న పొన్నూరు రూరల్ సీఐ ప్రభాకర్

చేబ్రోలు: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని చేబ్రోలు పోలీసులు అరెస్టు చేశారు. పొన్నూరు రూరల్ సీఐ పి.ప్రభాకర్ ఆదివారం విలేకర్ల సమావేశంలో వివరాల్ని వెల్లడించారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన షేక్ అషర్, ఒడిశా రాష్ట్రం కటక్ జిల్లా కిందరపద్ధ గ్రామానికి చెందిన రాజేష్ బరికి కలసి చేబ్రోలు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో స్థానిక ఎస్ఐలు కె. ఆనంద్, జి. వెంకటాద్రి నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయంపై కేసు నమోదు చేసి, ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బహిరంగంగా గంజాయి తాగుతున్న ముట్లూరుకు చెందిన నీలా థామస్ పాల్‌పై కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు సీఐ పి.ప్రభాకర్ తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని ఆయన సూచించారు.